# మెగా జాబ్ మేళా కు విశేష స్పందన



**బ్రహ్మంగారిమఠం,జులై12.అక్షర టైమ్స్:-** బ్రహ్మంగారిమఠంలోని స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల నందు సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగుల నుండి విశేష స్పందన లభించినట్లు ప్రిన్సిపల్ ముండ్లపాటి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలోని కొప్పర్తి ప్రాంతంలో ఏర్పాటు చేసిన డెక్సన్ కంపెనీ వారి తరపున కళాశాలలో జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని, ఈ జాబ్ మేళాకు మండల వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొని అర్హత సాధించారని వారికి త్వరలోనే నియామక పత్రాలను అందజేసి ఉద్యోగాన్ని కల్పిస్తామని, ఉద్యోగం పొందిన వారికి ఆకర్షణీయమైన జీతంతో పాటు ఉచిత భోజన రవాణా వసతి సౌకర్యం కల్పిస్తామని వారు తెలిపారు. అంతేకాకుండా మా కళాశాల ఆధ్వర్యంలో ఇక మీదట ప్రతినెల ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతీ యువకులను దృష్టిలో ఉంచుకొని జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని ఇందులో సాఫ్ట్వేర్ కు సంబంధించిన జాబ్ అలాగే హార్డ్వేర్ మరియు మరియు టెక్స్టైల్ వంటి కంపెనీల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తమ సంస్థ ద్వారా కృషి చేస్తామని ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో ఈ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

www.akshratimes.com



తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

# జూలై 14న "కలెక్టరేట్ పికెటింగ్" జయప్రదం చేయండి

**యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు**

**మాదన విజయకుమార్ పిలుపు**



**బద్వేల్,జులై12.అక్షర టైమ్స్:-** ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12 వ పిఆర్సీని తక్షణమే అమలు చేయాలని, పెండింగ్ డిఏ లను, ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జూలై 14వ తేదీ చేపట్టిన కడప "కలెక్టరేట్ ముట్టడిని" జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ పిలుపునిచ్చారు.ఆదివారం ఉదయం ప్రొద్దుటూరులోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాదన విజయకుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు అనేక ఆశలు పెట్టుకున్నారని, అయితే ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరుతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర నిరుత్సాహంతో ఉన్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, సమస్యలను పరిష్కరించడాన్ని విస్మరిస్తున్నారన్నారు. 12వ పిఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు అవుతున్నా పిఆర్సీని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. 11వ పిఆర్సీని సైతం అప్పటి వైసిపి ప్రభుత్వం మూడున్నరేళ్లు ఆలస్యంగా అమలు చేయడంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులతో పాటు సర్వీసులో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు జరుగుతున్న నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం తక్షణం 12వ పిఆర్సీ కమిషన్ ను ఏర్పాటు చేసి, పిఆర్సీ అమలయ్యే వరకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 29 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను కూటమి ప్రభుత్వం కొంతమేరకు చెల్లించినప్పటికీ, ఇంకా 25 వేల కోట్ల రూపాయల పైబడి బకాయిలు పేరుకపోయాయన్నారు. వీటి చెల్లింపులలో నిర్దిష్టమైన కాల వ్యవధి లేకపోవడం వల్ల పూర్తిస్థాయిలో బకాయిల చెల్లింపులు జరగడం లేదన్నారు. నాలుగు డిఏలు పెండింగ్ ఉన్నా పాలకులు కనీసం స్పందించడం లేదని విమర్శించారు. మూడు సంవత్సరాలుగా సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపులు లేవని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు, పాత పెన్షన్ అమలు లాంటి విధానాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. 2004 కు ముందు ఉద్యోగ నియామక ప్రక్రియ పూర్తయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలుపై ప్రభుత్వ ఉత్తర్వుల జారీలో జాప్యం తగదన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి మండలి ఆమోదం సైతం పొందినప్పటికీ ఉత్తర్వులను విడుదల చేయడంలో కాలయాపన ఎందుకని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉద్యోగులకు ఇచ్చిన హెల్త్ కార్డులపై ఉద్యోగులకు వైద్యం అందడం లేదని ఆరోపించారు. నగదు చెల్లించి వైద్యం పొందిన మెడికల్ బిల్లులు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆమోదం పొందినప్పటికీ వాటి చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నదని విమర్శించారు. దీనిపై కమిటీ నియమించినా ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నారు. కరోనా మహమ్మారిలో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టడంలో ప్రభుత్వ అలసత్వం సరికాదన్నారు. తక్షణం కారుణ్య నియామకాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను కారణంగా చూపి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత సాధించాలనడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యాహక చట్టం-2009 సెక్షన్ 23(1) కి సవరణకు కృషి చేయాలని కోరారు. చట్ట సవరణ జరిగే వరకూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ పరీక్షను, ఆఫ్ లైన్ విధానంలో నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ, తక్షణం 12 వ పిఆర్సీ కమిషన్ ను ఏర్పాటు చేయాలని, పిఆర్సీ అమలయ్యే వరకు 29 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, పెండింగ్ డిఏ లను విడుదల చేయాలని, ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ జూలై 14వ తేది ఫ్యాప్టో ఆధ్వర్యంలో చేపట్టిన కడప కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించాలని, లేకపోతే తగు మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎన్.కంబగిరి, ఎం.శ్రీను వాసులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పి.శశి కిరణ్ కుమార్, కె.చెంచి రెడ్డి, పి.నాగరాజు, వి.వి.రమణా రెడ్డి, కె.ఈశ్వరయ్య, ఎ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# జహంగీర్ ఆధ్వర్యంలో సూర్యనారాయణ రెడ్డికి శుభాకాంక్షలు



**బద్వేల్,జులై12.అక్షర టైమ్స్:-** బద్వేలు నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ నూతన ఇన్చార్జిగా మంచూరు సూర్యనారాయణరెడ్డి నియమితులైన సందర్భంగా ఆదివారం ఉదయం కడప పార్లమెంటు తెలుగుయువత ఉపాధ్యక్షులు, సీమాంక్ హాస్పిటల్ డైరెక్టర్ షేక్ జహంగీర్ భాషఆధ్వర్యంలో బెంగళూరులోని ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాచుపల్లి కృష్ణారెడ్డి, బిజివేముల చంద్రశేఖర్ రెడ్డి, బిజీవేముల రమణారెడ్డి, నాగిరెడ్డి రమణారెడ్డి, మహమ్మద్ రఫీ,షేక్ రఫీ,మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం

**ఆలయ ఛైర్మన్ పీవీ రమణ**





**వేంపల్లె,జూలై12.అక్షర టైమ్స్:-** స్థానిక పాపాగ్ని నది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కర్నూలు, తలుపుల, నందిమండలం, కడప తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి తలనీలాలు సమర్పించి, స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారని ఆలయ పాలకమండలి ఛైర్మన్ పీవీ రమణ తెలిపారు. ఆలయ ముఖ్య అర్చకుడు హరిప్రవీణ్ ఆధ్వర్యంలో స్వయంభూ శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వర స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష అలంకారం, నివేదన, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కడప సుభాష్, ఆలయ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

**మధుర జ్ఞాపకాలతో అలరించిన పూర్వ విద్యార్థులు**

**గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థిని, విద్యార్థులు**



**బ్రహ్మంగారిమఠం,జూలై12.అక్షర టైమ్స్:-** మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ నందు 1990-1991 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థిని విద్యార్థుల ఆత్మీయ కలయిక ఉత్సాహంగా ఉల్లాసంగా నిర్వహించారు. ఉదయం స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని పూర్వ విద్యార్థులు దర్శించుకుని అనంతరం భారీ ర్యాలీతో జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని దర్శించుకున్నారు. అనంతరం మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారు నీ కలిసి ఆశీర్వచనములు ఉంది స్వామివారి తీర్థ ప్రసాదాలను అందిపుచ్చుకున్నారు .అనంతరం వారి సోదరుడు దత్తాత్రేయ స్వామి వారి తోటి మిత్రులకు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి, ఫోటో ,రుద్రాక్ష ప్రసాదలను అందజేశారు. అనంతరం జగన్మాత శ్రీ జగన్మాత అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ ఈశ్వరీ దేవి మఠం మఠాధిపతి శ్రీ వీర శివకుమార స్వామివారిని దర్శించి ఈ సందర్భంగా స్వాములవారు వారికి ప్రసాదలు అందజేశారు. అనంతరం ఐదు రోడ్ల కూడలి నుంచి డీజే తో నృత్యాలు చేసుకుంటూ సభ ప్రాంగణానికి చేరుకున్నారు. ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంసమావేశాన్ని కి ఆ స్కూలు ఇన్చార్జి హెడ్ మాస్టర్ నరసింహారెడ్డి అధ్యక్షత వహించి సభను ప్రారంభించారు. విద్యార్థినిలు జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించగా ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా 1990 బ్యాచ్ ఉపాధ్యాయులు చలమయ్య, ఓబుల్ రెడ్డి, చెన్నారెడ్డి, సివి సుబ్బారెడ్డి హాజరయ్యారు. విశ్రాంతి ఉపాధ్యాయులు చలమయ్య మాట్లాడుతూ మా విద్యార్థులు ఒక సదుద్దేశముతో పూర్వ విద్యార్థుల కలయికను ఏర్పాటు చేసి నేను పనిచేసిన నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకునే అదృష్టం కల్పించినందుకు నాకు చాలా సంతోషంగా ఉందని విద్యార్థులంతా కూడా ఉన్నత స్థాయిలో ఉన్నందుకు వారి ఉపాధ్యాయుడిగా నాకు గర్వంగా ఉందని తెలియజేశారు. అనంతరం ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులంతా తమ బిడ్డ లాంటి వాళ్ళని వారి ఎదుగుదల చూస్తుంటే తమ బిడ్డల ఎదుగుదల చూస్తున్నట్లుగా మనసు పులకరించిందని ఆనాడు నేను సైన్స్ ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు విద్యాబోధన చేసి వారి జ్ఞానాన్ని పెంపొందించనని ఆ జ్ఞానపు వృక్షము నేడు ఇంతమంది ప్రయోజకులను చేసినందుకు ఉపాధ్యాయుడిగా నాకు గర్వంగా ఉందని ఆయన తెలిపారు. పూర్వపు విద్యార్థి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి సోదరులు శ్రీ దత్తాత్రేయ స్వామి మాట్లాడుతూ విద్య చాలా విలువైనదని విద్య లేనిదే మానవ మనుగడ లేదని విద్య పరులు దోచలేని సంపదని అలాంటి విద్యాబుద్ధులు మాకు నేర్పించిన మా గురువులను నేడు ఈ పూర్వపు విద్యార్థుల ఆత్మీయ కలయిక నేడు వారిని కలిసి వారి ఆశీస్సులను పొందడం మా పూర్వజన్మ సుకృతం అని అన్నారు, మరొక పూర్వ విద్యార్థి ఆవుల దస్తగిరి నాయుడు మాట్లాడుతూ తాము విద్యాబుద్ధులు నేర్చుకునే సమయంలో మా ఉపాధ్యాయులు మమ్మల్ని సన్మార్గంలో నడిపించడం కోసం వారు నిరంతరం కష్టపడి తమ విద్యార్థులు ప్రయోజకులు కావాలని మమ్మల్ని సన్మార్గంలో నడిపిస్తూ వారు అనేక రూపాలుగా మమ్మల్ని ప్రయోజకులు చేయడం కోసం కృషి చేశారని ఆనాటి కాలంలో తమకు లోక పరిజ్ఞానం తెలియకున్న లోకాన్ని లోకజ్ఞానాన్ని మాకు నేర్పించి మా అంధకారాన్ని తొలగించిన గొప్ప మార్గదర్శకులు మా గురువులని ఆయన కొనియాడారు. అనంతరం విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఇంతటి విజయవంతం చేయడానికి కృషి చేసిన ఆర్గనైజర్ దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమతో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులంతా కూడా కలిసి ఒక చోటికి రావడం చాలా శుభదాయకమని ఎప్పుడో 35 సంవత్సరాల క్రితం తామంతా ఈ పాఠశాలలో చదువుకొని వృత్తిరీత్యా అనేక ప్రాంతాల్లో స్థిరపడ్డాము నేడు ఈ ఆత్మీయ కలయిక ద్వారా అందరం ఒకచోట కలుసుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో పూర్వక విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈ నెల 13న ప్రజా సమస్యల పరిష్కార వేదిక




**నంద్యాల,జులై12.అక్షర టైమ్స్:-** జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతో ఈ నెల 13వ తేదీ (సోమవారం) జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు మరియు మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను నేరుగా అధికారులకు సమర్పించవచ్చని, అలాగే meekosam.ap.gov.in వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందని తెలిపారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్సైట్లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చన్నారు.అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ముందుగా మండల, డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి

**శస్త్రచికిత్స విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం**

**జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ సభ్యురాలు యారవ దివ్య**



**కడప,జూలై12.అక్షర టైమ్స్:-** రాష్ట్ర డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్కు కుడి భుజానికి నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడం పట్ల జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ సభ్యురాలు యారవ దివ్య సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకుంటున్నారని పేర్కొన్నారు. భుజం గాయంతో బాధపడుతున్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకుడు పవన్ కళ్యాణ్ అని దివ్య పేర్కొన్నారు. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని మరింత ఉత్సాహంతో ప్రజాసేవలో కొనసాగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు యారవ దివ్య తెలిపారు.

# సేవ భావానికి సెల్యూట్ ఉషారాణి సేవలను ప్రశంసించిన ప్రముఖులు

**39 ఏళ్ల నిబద్ధత, క్రమశిక్షణతో కూడిన ఉద్యోగ జీవితానికి ఘనంగా వీడ్కోలు సభ**





**ఆదోని,జూలై12.అక్షర టైమ్స్:-** జలవనరుల శాఖలో 39 ఏళ్లపాటు వివిధ హోదాల్లో సేవలందించిన ఉషారాణి పదవీ విరమణ సందర్భంగా ఆదివారం ఆదోని చేకూరి ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణతో పాటు మహిళా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన ఉషారాణికి ఈ సందర్భంగా అభినందనల వెల్లువ ఎగసిపడింది. కార్యక్రమానికి హాజరైన అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, శ్రేయోభిలాషులు ఆమె సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఉషారాణి, ఆమె భర్త అడ్వకేట్ నాగేంద్రయ్యతో పాటు కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. జలవనరుల శాఖలో విధులు నిర్వహించిన కాలంలో ఉషారాణి నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావంతో ప్రత్యేక గుర్తింపు పొందారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఆమె ఎల్లప్పుడూ ముందుండేవారని గుర్తుచేశారు. మహిళా ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, కార్యాలయాల్లో మహిళలకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ఆమె చేసిన కృషి ప్రశంసనీయమని అభిప్రాయపడ్డారు. ఉద్యోగ సంఘాల నాయకురాలిగా కూడా ఆమె అనేక సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. సేవా కాలమంతా నిజాయితీ, అంకితభావంతో పనిచేసి సహోద్యోగులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోస్ నాయకులు, ఆదోని జిల్లా సాధన సమితి ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు, రాజకీయ ప్రముఖులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన సిబ్బంది, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్చకులు, పరిచారకుల నియామకంపై వినతి

**దర్శన వేళల సూచిక బోర్డుల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి**

**బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్**



**వేంపల్లె,జూలై12.అక్షర టైమ్స్:-** శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న ఆలయాల్లో అర్చకులు, పరిచారకుల నియామకంతో పాటు భక్తుల సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆదివారం దేవస్థానం ఈఓ కడప సుభాష్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ, వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తులు, ప్రతి ఏడాది రూ. కోటి మేర ఆదాయం ఉన్నప్పటికీ అనుబంధ ఆలయాల్లో అర్చకులు, పరిచారకుల నియామకంలో జాప్యం తగదన్నారు. అలాగే సేవలు, దర్శన వేళలను తెలియజేసే సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, భక్తులకు అర్చకులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ఈఓ సానుకూలంగా స్పందించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. హిందూ భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని తక్షణమే చర్యలు చేపట్టాలని గాలి హరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## నంద్యాల నూతన ట్రాఫిక్ సీఐగా ఆర్.జే. సుబ్రహ్మణ్యం బాధ్యతలు స్వీకరణ



**నంద్యాల,జులై12.అక్షర టైమ్స్:-** నంద్యాల నూతన ట్రాఫిక్ సీఐగా ఆర్.జే.సుబ్రహ్మణ్యం బాధ్యతలు చేపట్టారు.ప్రజల సహకారంతో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రజకుల సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి ఉంది గుడిసె ఆది కృష్ణమ్మ

రజక ఆకాంక్ష సభలో పాల్గొన్న గుడిసె ఆది కృష్ణమ్మ







**ఆదోని,జూలై12.అక్షర టైమ్స్:-** అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని విరూపాక్షి ఫంక్షన్ హాల్‌లో రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి అధ్యక్షతన రజక ఆకాంక్ష సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడిసె ఆది కృష్ణమ్మ మాట్లాడుతూ, రజక సామాజిక వర్గం రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. వారి సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి, సామాజిక పురోగతి కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతతో పనిచేస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రజకుల ఉపాధి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, కార్పొరేషన్ ద్వారా అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, ప్రతి అర్హత కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అనంతరం రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి మాట్లాడుతూ, రజకుల సమస్యల పరిష్కారం, సంక్షేమం మరియు అభివృద్ధే కార్పొరేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి లబ్ధిదారునికి చేరవేయడానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రజక సంఘ నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో రజక సోదరులు పాల్గొని సభను విజయవంతం చేశారు.

## ఇక్కడి ఇసుకను తెల్ల బంగారంగా పిలుస్తారు ఎందుకో తెలిస్తే అవునా.. నిజమా.? అంటూ నోరెళ్ల బెట్టాల్సిందే!




భారతదేశంలోని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కేవలం వ్యవసాయానికే కాదు, అద్భుతమైన ఖనిజ సంపదకు కూడా నిలయం. ఇక్కడి నేలల్లో లభించే సిలికా శాండ్ ను స్థానికులు తెల్ల బంగారం అని పిలుస్తారు. దీనికి కారణం ఈ ఇసుక ద్వారానే కోట్లాది రూపాయల విలువైన గాజు పరిశ్రమ నడుస్తోంది. ముఖ్యంగా యూపీలోని ఫిరోజాబాద్ నగరం గ్లాస్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచింది. ఫిరోజాబాద్ గాజు పరిశ్రమ, ఇక్కడి తెల్ల బంగారానికి సంబంధించిన ఆసక్తికరమైన అంశాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్ భూగర్భంలో దాగి ఉన్న సిలికా శాండ్‌ను అక్కడి ప్రజలు తెల్ల బంగారం (ఔష్ట్రఠవ +శీశ్రీ఼) అని పిలుస్తారు. ముఖ్యంగా ఫిరోజాబాద్ నగరం భారతదేశపు గాజు రాజధానిగా (+శ్రీ఼ం ఝఝజూఝశ్రీ) ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. ఫిరోజాబాద్‌లో గాజు తయారీ సంప్రదాయం శతాబ్దాల నాటిది. మొఘల్ కాలంలో, ముఖ్యంగా అక్బర్ చక్రవర్తి పాలనలో పర్షియా, మధ్య ఆసియా నుండి నిపుణులైన గాజు కళాకారులను ఇక్కడికి రప్పించారు. వారు స్థానిక మట్టిలోని ప్రత్యేకతను గుర్తించి గాజు వస్తువుల తయారీకి పునాది వేశారు. పురావస్తు ఆధారాల ప్రకారం, బస్తీ జిల్లాలోని కోపియాలో జరిపిన త్రవ్వకాల్లో క్రీస్తుపూర్వం 3వ శతాబ్దానికి చెందిన గాజు అవశేషాలు లభించడం గమనార్హం. యూపీలోని ప్రయాగ్‌రాజ్ (శంకర్గఢ్), మీర్జాపూర్, సోన్‌భద్ర, చిత్రకూట్, బాండా వంటి జిల్లాల్లో అత్యున్నత నాణ్యత కలిగిన సిలికా ఇసుక లభిస్తుంది. శంకర్గఢ్ నుండి సేకరించిన ఇసుక దేశవ్యాప్తంగా ఉన్న గాజు కర్మాగారాలకు సరఫరా చేయబడుతుంది. ఇందులో ఐరన్ ఆక్సైడ్ తక్కువగా ఉండటం వల్ల ఇది గాజు తయారీకి అత్యంత అనువైనదిగా పరిగణించబడుతుంది. ఈ సిలికా ఇసుకను ఉపయోగించి కేవలం అలంకరణ వస్తువులే కాకుండా, ఆధునిక కాలంలో అత్యంత అవసరమైన సోలార్ ప్యానెల్ గ్లాస్, కిటికీ అద్దాలు, ఔషధాల సీసాలను తయారు చేస్తున్నారు. దాదాపు 200 ఏళ్లుగా ఫిరోజాబాద్ గాజు గాజులతయారీలో ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఇక్కడ తయారయ్యే రంగురంగుల గాజులు విదేశాలకు కూడా ఎగుమతి అవుతుంటాయి. యూపీ నేలల్లో ఉన్న ఈ సహజ సంపద లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తోంది. నాణ్యమైన ముడిసరుకు, తరతరాలుగా వస్తున్న కళాకారుల నైపుణ్యం కలగలిసి ఉత్తరప్రదేశ్‌ను గాజు పరిశ్రమలో ప్రపంచ పటంలో నిలబెట్టాయి. ఒక సామాన్యమైన ఇసుక రేణువును అద్భుతమైన గాజు శిల్పంగా మార్చే ఈ ప్రయాణం నిజంగా ఆశ్చర్యకరం.

## రూపాయి విలువ పడిపోతున్నా టెన్షన్ అక్కర్లేదు! RBI మాజీ గవర్నర్ కీలక వ్యాఖ్యలు




భారత రూపాయి విలువ క్షీణత ఆందోళన కలిగించినా, అతిగా భయపడాల్సిన అవసరం లేదని మాజీ ఆర్‌బీఐ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. బలహీన రూపాయి ఎగుమతులకు ఊతమిస్తుందని, 2013తో పోలిస్తే భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు బలంగా ఉందని ఆయన వివరించారు. అవసరమైనప్పుడు మాత్రమే ఆర్‌బీఐ జోక్యం చేసుకోవాలని సూచించారు. భారతీయ రూపాయి విలువ ఇటీవల అమెరికా డాలర్‌తో పోలిస్తే భారీగా క్షీణించిన నేపథ్యంలో భారత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు కీలక వ్యాఖ్యలు చేశారు. రూపాయి బలహీనపడటం ఆందోళన కలిగించే అంశమే అయినప్పటికీ, దానిపై అతిగా భయపడాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఇంట్రాడే ట్రేడింగ్‌లో 95.80 వరకు పడిపోయి, చివరకు 95.71 వద్ద ముగియడం మార్కెట్లలో చర్చనీయాంశమైంది. అయితే కరెన్సీ మార్పిడిలో కొంత స్థాయి ఒత్తిడి సహజమని, మార్కెట్ పరిస్థితుల ప్రకారం రూపాయి తన నిజమైన విలువను కనుగొనే అవకాశం ఇవ్వాలని సుబ్బారావు సూచించారు. ఆయన అభిప్రాయం ప్రకారం బలహీనమైన రూపాయి ప్రతికూలతలతో పాటు కొన్ని ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది. ముఖ్యంగా, దిగుమతి అయ్యే ముడి చమురు ఖర్చు పెరగడం వల్ల దేశంలో చమురు వినియోగం కొంత తగ్గవచ్చు. అదే సమయంలో భారతీయ ఎగుమతులు అంతర్జాతీయ మార్కెట్లో మరింత పోటీ సామర్థ్యాన్ని పొందే అవకాశం ఉందని చెప్పారు. రూపాయి విలువ తగ్గడంతో విదేశీ కొనుగోలుదారులకు భారత ఉత్పత్తులు తక్కువ ధరలకు లభిస్తాయి కాబట్టి, ఎగుమతులకు ఊతం లభించవచ్చని ఆయన వివరించారు. 2013లో జరిగిన ఆర్థిక సంక్షోభంతో ప్రస్తుత పరిస్థితిని పోల్చిన సుబ్బారావు, ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ గతంతో పోలిస్తే మరింత బలంగా ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా విదేశీ మారక నిల్వలు, ద్రవ్యలోటు నియంత్రణ, బ్యాంకింగ్ వ్యవస్థ స్థిరత్వం వంటి అంశాల్లో భారత్ మంచి స్థితిలో ఉందన్నారు. 2013 టేపర్ టాంట్రమ్ సమయంలో విదేశీ పెట్టుబడుల భారీ ఉపసంహరణ కారణంగా రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. అయితే ఇప్పుడు పరిస్థితులు అంతగా ప్రమాదకరంగా లేవని ఆయన భావిస్తున్నారు.

## ఈవీ కొనుగోలుదారులకు సర్కార్ గుడ్ న్యూస్ రూ. లక్ష సబ్సిడీ 50% టాక్స్ తగ్గింపు..!



దేశవ్యాప్తంగా కాలుష్య నియంత్రణ, పెరుగుతున్న ఇంధన ధరల భారాన్ని తగ్గించడంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఇందులో భాగంగానే పర్యావరణహిత రవాణా వ్యవస్థను ప్రోత్సహించడానికి ఎలక్ట్రిక్ వాహనాల (జు఼) వినియోగాన్ని పెంచేలా సరికొత్త వ్యూహాలను అమలు చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళా సాధికారతను ప్రోత్సహించే దిశగా సర్కార్ ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా కాలుష్య నియంత్రణ, పెరుగుతున్న ఇంధన ధరల భారాన్ని తగ్గించడంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఇందులో భాగంగానే పర్యావరణహిత రవాణా వ్యవస్థను ప్రోత్సహించడానికి ఎలక్ట్రిక్ వాహనాల (జు఼) వినియోగాన్ని పెంచేలా సరికొత్త వ్యూహాలను అమలు చేస్తున్నాయి. తాజాగా బీహార్ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళా సాధికారతను ప్రోత్సహించే దిశగా ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో 'బీహార్ ఎలక్ట్రిక్ వాహనాల (సవరణ) విధానం 2026' కు ఆమోదం లభించింది. ఈ కొత్త ఈవీ విధానం ప్రకారం, రాష్ట్రంలో ఎలక్ట్రిక్ కార్లను (ఫోర్ వీలర్స్) కొనుగోలు చేసే మహిళలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. మహిళలు ఈవీ కార్లను కొనుగోలు చేస్తే ఏకంగా రూ. 1 లక్ష వరకు నేరుగా సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అందించనుంది. ఇది మహిళలు స్వయం సమృద్ధి సాధించడానికి, పర్యావరణహిత ప్రయాణాన్ని ఎంచుకోవడానికి ఎంతో దోహదపడుతుంది. ఈ కొత్త విధానం కేవలం కార్లకే పరిమితం కాకుండా, ద్విచక్ర, త్రిచక్ర వాహనాల కొనుగోలుదారులకు కూడా భారీ ఉపశమనాన్ని కలిగిస్తోంది. వాహనాల కేటగిరీని బట్టి సబ్సిడీ విధానం మారుతుంది. సాధారణ వర్గానికి చెందిన వ్యక్తులు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేయడానికి 10,000 రూపాయల వరకు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వ్యక్తులు 12,000 రూపాయల వరకు సబ్సిడీని పొందుతారు. ఎలక్ట్రిక్ కార్గో త్రిచక్ర వాహనాల కోసం, సాధారణ వర్గానికి 50,000 రూపాయల వరకు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 60,000 రూపాయల వరకు సబ్సిడీ లభిస్తుంది. దీంతో పాటు, బీహార్‌లో ఈవీ వాహనాలను కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రతి ఒక్కరికీ మోటారు వాహన పన్నులో (వీశీశీతీ ఎవఫ్ట్రఅఎశ్రీవ ఝఇ఼) ఏకంగా 50 శాతం వరకు రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ స్క్రాపేజ్ విధానానికి అనుగుణంగా, పాత పెట్రోల్, డీజిల్ వాహనాలను స్క్రాప్ చేసి కొత్త ఈవీలను కొనే వారికి అదనపు ప్రయోజనాలు కూడా అందుతాయి. రాష్ట్రంలో కాలుష్యాన్ని తగ్గించి, స్వచ్ఛమైన గాలిని అందించడమే లక్ష్యంగా బీహార్ ప్రభుత్వం పని చేస్తోంది. 2030 నాటికి రాష్ట్రంలో నమోదయ్యే మొత్తం కొత్త వాహనాలలో కనీసం 30 శాతం ఎలక్ట్రిక్ వాహనాలే ఉండాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ లక్ష్యం గనుక నెరవేరితే, రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 100 మిలియన్ లీటర్ల పెట్రోల్, డీజిల్ ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇది సామాన్యుడి జేబుకు రవాణా ఖర్చులను తగ్గించడమే కాకుండా, పర్యావరణాన్ని ఎంతగానో కాపాడుతుంది. ఎలక్ట్రిక్ వాహనదారులకు ఛార్జింగ్ ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో భారీగా ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. నగరాల్లోని షాపింగ్ మాల్స్, హోటళ్లు, పెట్రోల్ పంపులు, పెద్ద నివాస సముదాయాలలో ఈవీ ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసే నిర్వాహకులకు ప్రత్యేక ప్రోత్సాహకాలను కూడా అందించనున్నారు. బీహార్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రవాణా రంగాన్ని సరికొత్త హరిత మార్గం వైపు నడిపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## డబ్బే డబ్బును సంపాదించే దిమ్మతిరిగే ఐడియా.. ఇప్పుడే ప్రారంభించండి.! సీక్రెట్ టిప్స్..



మన జీవితంలో డబ్బు కంటే సమయమే అత్యంత విలువైనది. చాలా మంది గంటల కొద్దీ చిన్న చిన్న బేరసారాల కోసం సమయాన్ని వృథా చేస్తుంటారు. కానీ అదే సమయాన్ని తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి కేటాయిస్తే ఆదాయం కొన్ని రెట్లు పెరుగుతుంది. అంబానీకైనా, వారెన్ బఫెట్‌కైనా మనకైనా రోజుకు ఉండేది 24 గంటలే.. డబ్బు సంపాదించడం ఎలా? ఈ ప్రశ్న మనలో చాలామందికి నిత్యం మెదలుతూనే ఉంటుంది. కానీ, ఆదాయాన్ని కేవలం సంపాదించడం మాత్రమే కాదు, దాన్ని సరిగ్గా వృద్ధి చేసుకోవడం కూడా ఒక గొప్ప కళేనని ఆర్థిక నిపుణులు బలంగా చెబుతున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆర్థిక నిపుణులు ఒకరు సంపాదన, సంపదకు సంబంధించిన కొన్ని అత్యంత ఆసక్తికరమైన, ప్రాక్టికల్ విషయాలను పంచుకున్నారు. మన జీవితంలో ఆర్థిక ప్రణాళిక అనేది కేవలం పొదుపుకే పరిమితం కాకుండా, సమయాన్ని, డబ్బును మనం ఏ విధంగా మేనేజ్ చేస్తామనే దానిపైనే పూర్తిగా ఆధారపడి ఉంటుంది. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆర్థికంగా స్థిరపడాలని కోరుకుంటారు, కానీ దానికి సరైన మార్గం ఏంటో చాలా మందికి తెలియదు. ఇక్కడ మనిషి ఆలోచనా దృక్పథం అనేది చాలా కీలకంగా మారుతుంది. ముందుగా సమయానికి, డబ్బుకు మధ్య ఉన్న లోతైన తేడాను గుర్తించడం చాలా అవసరం. సాధారణంగా మనం సమయమే అన్నింటికంటే విలువైనది అని మాటల్లో చెప్తాం కానీ, మన నిత్య జీవితంలో మాత్రం డబ్బుకే ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తూ ఉంటాం. డబ్బు మళ్లీ సంపాదించుకోవచ్చు కానీ గడిచిన సమయం ఎప్పటికీ తిరిగి రాదు. ఈ చిన్న లాజిక్ మన బ్రెయిన్‌కు అర్థమైతే సంపాదన మార్గాలు ఆటోమేటిక్‌గా మెరుగుపడతాయి. అనవసరమైన బేరసారాలు చేస్తూ గంటల కొద్దీ మన విలువైన సమయాన్ని వృథా చేసే బదులు, అదే సమయాన్ని కొత్త విషయాలు నేర్చుకోవడానికి లేదా మనం చేసే వృత్తిలో మరింతగా రాణించడానికి ఉపయోగిస్తే మన ఆదాయం ఖచ్చితంగా పెరుగుతుంది. మన ప్రతి నిమిషం ఒక ఇన్వెస్ట్‌మెంట్ లాంటిది. డబ్బును వృద్ధి చేసుకోవాలంటే కేవలం ఏదో ఒక చోట పెట్టుబడులు పెడితే సరిపోదు, దానికంటూ ఒక క్రమశిక్షణ కలిగిన పద్ధతి ఉండాలి. లోకంలో 'రిచ్ పీపుల్ పూర్ పీపుల్' ఉండరు, కేవలం 'రిచ్ థింకింగ్ పూర్ థింకింగ్' మాత్రమే ఉంటుంది. మన ఆదాయంలో కొంత భాగాన్ని మొదట సెక్యూరిటీ కోసం అంటే ఇన్సూరెన్స్ వంటి వాటి కోసం కేటాయించాలి. ఏదైనా అనారోగ్యం పాలైనప్పుడు మన కష్టార్జితం మొత్తం ఆసుపత్రి పాలవ్వకుండా ఉండాలంటే ఇన్సూరెన్స్ చాలా ముఖ్యం. ఆ తర్వాత అత్యవసర నిధి ఏర్పాటు చేసుకోవాలి. ఇది మనకు ఉద్యోగం పోయినా లేదా అనుకోని కష్టాలు ఎదురైనా అండగా నిలుస్తుంది. ఇలాంటి చిన్న చిన్న జాగ్రత్తలు మనల్ని పెద్ద ఆర్థిక సంక్షభాల నుండి రక్షిస్తాయి. చివరగా, మన ప్రతి రూపాయిని ట్రాక్ చేయడం అలవాటు చేసుకోవాలి. మనకు వచ్చే ఆదాయం ఎంత? మనం చేసే ఖర్చులు ఏమిటి? ఆస్తులు, అప్పుల మధ్య సమతుల్యత ఎలా ఉంది? అనే విషయాలను ఒక ఎక్సెల్ షీట్‌లో లేదా బుక్‌లో రాసుకోవాలి. దీన్నే 'రియల్ స్టేట్మెంట్' అంటారు. కేవలం విలాసాల కోసం ఎంత ఖర్చు పెడుతున్నామో తెలిస్తేనే, అనవసర ఖర్చులను అరికట్టగలం. సంపద సృష్టించడం అనేది ఒక్క రోజులో లేదా ఒక్క రాత్రిలో జరిగేది కాదు. దీనికి ఓపిక, పట్టుదల, నిరంతర పర్యవేక్షణ ఎంతైనా అవసరం. మనం సంపాదన పట్ల ఎంత శ్రద్ధ చూపిస్తామో, మన సమయం పట్ల కూడా అంతే గౌరవం చూపినప్పుడే ఆర్థికంగా ఉన్నత స్థానానికి చేరుకోగలం. ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తే వచ్చే ఐదేళ్లలో మన ఆర్థిక స్థితిగతుల్లో స్పష్టమైన మార్పును గమనించవచ్చు. తెలివిగా ఆలోచించండి, మీ సమయాన్ని గౌరవించండి, అద్భుతమైన సంపదను సృష్టించండి. మన ఆలోచనా విధానమే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది కాబట్టి ఎప్పుడూ పాజిటివ్‌గా ఉండండి. మీ విజయానికి మీరే బాధ్యులు అన్న విషయాన్ని మర్చిపోకండి. క్రమశిక్షణతో కూడిన పెట్టుబడి, కాలంపై అవగాహన మీ జీవితాన్ని సంపన్నం చేస్తాయి. మీ జీవితంలో ఆర్థిక లక్ష్యాలను నిర్దేశించుకోండి.

## కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం.. చక్కెర ఎగుమతులపై నిషేధం! ఎందుకంటే?




భారత ప్రభుత్వం చక్కెర ఎగుమతులను తక్షణమే నిలిపివేసింది, ఈ నిషేధం 2026 సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటుంది. దేశీయ మార్కెట్‌లో చక్కెర ధరలను స్థిరీకరించడం, ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడమే దీని వెనుక ప్రధాన ఉద్దేశ్యం. దేశీయ ఉత్పత్తి తగ్గుదల, వాతావరణ అనిశ్చితి ఈ నిర్ణయానికి దారితీశాయి. భారత ప్రభుత్వం చక్కెర ఎగుమతులపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తాజా నివేదికల ప్రకారం ముడి, శుద్ధి చేసిన చక్కెర ఎగుమతులను తక్షణమే నిలిపివేస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఈ నిషేధం 2026 సెప్టెంబర్ 30 వరకు లేదా తదుపరి ఆదేశాలు వెలువడే వరకు అమల్లో ఉండనుంది. దేశీయ మార్కెట్లో చక్కెర ధరలు అదుపు తప్పకుండా చూడడం, ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడమే ఈ చర్య వెనుక ప్రధాన ఉద్దేశ్యమని తెలుస్తోంది. అయితే ఇప్పటికే రవాణా ప్రక్రియలో ఉన్న కొన్ని సరుకులకు మినహాయింపులు ఇవ్వనున్నట్లు సమాచారం. నిషేధానికి ముందు లోడింగ్ ప్రారంభమైన సరుకులు, భారత ఓడరేవుల వద్ద ఇప్పటికే లంగరు వేసిన నౌకలు, లేదా కస్టమ్స్‌కు ముందుగానే అప్పగించిన నిల్వలకు ఎగుమతి అనుమతి కొనసాగనుంది. దీంతో విదేశీ కొనుగోలుదారులతో ఇప్పటికే కుదిరిన ఒప్పందాలకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. ఈ నిర్ణయం విధానపరంగా పెద్ద మార్పుగా భావిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో దేశీయ ఉత్పత్తి అవసరాలకు మించి ఉంటుందని అంచనా వేసిన కేంద్రం, 1.59 మిలియన్ టన్నుల చక్కెర ఎగుమతికి అనుమతి ఇచ్చింది. కానీ ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాల్లో చెరకు దిగుబడులు తగ్గడం, వాతావరణ అనిశ్చితి పెరగడం పరిస్థితిని మార్చేశాయి. పరిశ్రమ వర్గాల అంచనాల ప్రకారం, వరుసగా రెండో ఏడాది కూడా భారత్ వినియోగించే మొత్తానికి తక్కువ చక్కెరనే ఉత్పత్తి చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాతావరణ నిపుణులు అభివృద్ధి చెందుతున్న ఎల్‌నినో ప్రభావంపై కూడా హెచ్చరిస్తున్నారు. పశ్చిమ, దక్షిణ భారతదేశాల్లో చెరకు సాగుకు కీలకమైన నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉండటంతో, భవిష్యత్ ఉత్పత్తిపై మరింత అనిశ్చితి నెలకొంది. బలహీనమైన వర్షాలు వస్తే సరఫరా ఒత్తిడి మరింత పెరిగే ప్రమాదం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఆమోదించిన ఎగుమతి కోటాలో దాదాపు 8 లక్షల టన్నుల సరుకులకు ఒప్పందాలు కుదిరాయి. అందులో 6 లక్షల టన్నులకు పైగా సరుకు విదేశాలకు తరలిపోయినట్లు సమాచారం. ఇప్పుడు మిగిలిన సరఫరాలను ఎలా నిర్వహించాలన్న దానిపై వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత్ ప్రపంచంలో రెండో అతిపెద్ద చక్కెర ఉత్పత్తిదారుగా ఉండటంతో, ఈ నిర్ణయం అంతర్జాతీయ మార్కెట్లపై కూడా ప్రభావం చూపుతోంది. ఆసియా, ఆఫ్రికా దేశాలు ఇప్పుడు సరఫరాల కోసం బ్రెజిల్, థాయిలాండ్‌ల వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రకటన తర్వాత అంతర్జాతీయ మార్కెట్లో ముడి చక్కెర, తెల్ల చక్కెర ఫ్యూచర్స్ ధరలు పెరిగాయి. ప్రస్తుతం మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, పెరుగుతున్న ముడి చమురు ధరలు, గ్లోబల్ సరఫరా గొలుసు అంతరాయాల మధ్య భారత్ తీసుకుంటున్న ఈ రక్షించే ప్రయత్నంగానే కనిపిస్తున్నాయి.